# ఉంగరం

శంకమంచి పార్ధసారధి

రెండేళ్ళు!

రెండేళ్ళకాలం మానవ చరిత్ర సాగరంలో నీటిబొట్టు కావచ్చునేమో గాని,ఇ ఒక సామాన్యుడి జీవిత తటాకంలో హెచ్చు తగ్గులు చూడగలిగేటంతకాలం. కృషిని బట్టి ఫలితాలుంటాయ్. రెండేళ్ళలో వుద్యోగస్తుడు కావచ్చు, తండ్రికావచ్చు, బృహస్పతి కావచ్చు, పిచ్చివాడు కావచ్చు – అనుకుంటే ఏదైనా కావచ్చు.

వివేకం చాలా సామాన్యుడు. అంచేత గత రెండేళ్ళల్లో కాకతాళీయంగా వుద్యోగస్తుగడయ్యేడు అహర్నిశలూ మాణిక్యాన్ని తల్చుకుంటూ పిచ్చివాడయ్యేడు.

వివేకం పూర్తిపేరు వికానందం. ఆ పేరుతనకెవ్వరు పెట్టేరో, ఎందుకోసం పెట్టేరో అతడికి తెలియదు కారణం, అతడికి వూహతెలీకమునుపే – అంటే మంచికి చెడుకి, వెలుగుకి చీకటికి, అమృతానికి విషానికి తేడా తెలీకమునుపే తల్లిదండ్రులు పోయేరు. అంచేత ఇంతమహత్తు కల్గిన ఆ మహానీయుడిపేరు తనకి పెట్టేకవాళ్ళు పోయేరా లేక వాళ్ళు పోయేక ఎవరైనా పెట్టేరాన్న విషయం అతడికి తెలీదు. అతడికి తెల్సిందల్లా అమ్మానాన్న లేనితనని అన్నయ్య పెంచేడు – అని, అన్నయ్య అన్నం పెట్టేడు. అన్నయ్య నీళ్ళుపోసేడు. అన్నయ్య జోలపాడి నిద్రపుచ్చేడు. తనకి జ్వరం వస్తేఅన్నయ్య ఏడ్చేడు – ఇంతే తెలుసు. ఇంతకు మించి తెల్సుకోవాలనుకున్న ప్రయత్నం గూడా చేసేడు కాదు వివేకం.

అతడు జీవితంలో ప్రథమంగా మాధుర్యాన్ని రుచిచూసేడు.

వివేకానికి నూనూఉగమీసాలు. నిక్కర్లు వొదిలి ఫ్యాంట్లు, స్కూలు వొదిలి కాలేజీకి వెళ్ళేకాలం సమీపిస్తున్న తరుణంలో అన్నయ్యకి పెళ్ళయ్యింది. అతడి వొదినకి చిరాకెక్కువ. ప్రతిచిన్న విషయానికి కస్సుబుస్సులాడేది ( అన్నయ్యమీద గూడా ). కొత్తగా కాపురానికొచ్చిన ఆడపిల్లకుండాల్సిన లక్షణాలు బొత్తిగా వుండేవి కావు. బహుశా దానిక్కారణం, ఆమె పుట్టింటి సిరి సంపదల, మెట్టినింటి సామాన్యత్వం కావచ్చు. కాకపోతే భర్తకి వెనకాముందు ( తను తప్ప) ఎవరూ లేరన్న ధిలాసాకావచ్చు కారణం ఏదైనా కట్టుకున్నవాడిని, వాడి తమ్ముడ్ని కూడా సమాన స్థాయిలో చిన్న చూపుచూసేది.

వివేకం అన్న పేరు సుందరమూర్తి. మెత్తటివాడు. మనసు గూడా అదేబాపతు. భార్యనేం అనలేక తమ్ముడ్ని వొదులుకోలేక తనలోతను పెళ్ళలు పెళ్ళలుగా విరిగిపోయేవాడు. తమ్ముడ్ని తరచు పక్కకి పిల్చి అడుగుతుండేవాడు – ' వొదిన తిన్నగా చూస్తోందా ' అనో లేక ' అన్నంలో ఏం వేసుకు తిన్నావ్ ' అనో మొదట్లో వివేకానికి ఏం చెప్పాలో తెలీక తెల్లమొహం వేసేవాడు. కాని కాలక్రమేణా, తెల్సుకున్నాడు – నిజం చెప్పి అన్నయ్యని బాధపెట్టటంకంటే, అబద్ధం చెప్పి ఆనందపర్చటం వుత్తమం – అని. పరిస్థితిన బట్టి అబద్ధంలో గూడా ఆనందం వుందని అప్పుడే తెలిసొచ్చింది.

ఈ పరిస్థితి కొన్నాళ్ళు ఆతర్వాత అన్నయ్య తనకేం కావాలో, ఎవరు కావాలో నిర్ణయించుకున్నాడు.

సుందరమూర్తి ఇప్పటికీ తమ్ముడితో మాట్లాడతాడు. ఆ మాటలో గొప్ప మార్పొచ్చింది. నిశితంగా చూస్తాడు. కానీ, ఆ చూపులో మునుపటి చల్లదనం పోయి, ఏదో అర్థంకాని కరుకుతనం వచ్చిపడింది. ' భోం చేశావా ? ' అనడుగుతాగు – కానీ కేవలం లాంఛన ప్రాయంగా అడిగినట్లుగా వుంటుందా ప్రశ్న. ఇది చాలా సహజమైన పరిణామమని తెల్సుకోలేని వివేకం విచారపడ్డాడు. బాధపడ్డాడు. ఏడ్చిన సందర్భాలు గూడా లేకపోలేదు.

అమ్మ లేదు నాన్న లేదు. వున్నాడనుకున్న కొండంత అన్నయ్య వొదిన చేతిలో మంచు పర్వతంలా మారిపోయి, ఇమిడి పోయేడు. తనకెవరున్నారు ? తనెవరిక్కావాలి ? మనిషిలోని భావాల్ని, ఆశలని, అశయాలని, మానవత్వాన్ని మట్టుపెట్టే ఇలాంటి ప్రాథమిక ప్రశ్నలు తలెత్తిన తరుణంలో, అతడి చీకటి గుండెల్లో అరుణోదయం కావించిన ఏకైక వ్యక్తి మాణిక్యం.

మాణిక్య ఎర్రగా వుంటుంది – వుదయిస్తున్న సూర్యబింబంలా. మాణిక్యం నిండుగా , చల్లగా నవ్వుతుంది – పున్నమినాటి చంద్రుడిలా, పుష్టిగా , పొంకంగా , ఆరోగ్యంగా వుంటుంది – విరగబూసిన మందార చెట్టులా. ఆమె నవ్వితే వీణపలికినట్లు, నడిస్తే నాట్యం చేసినట్లు, కోపమొస్తే మొహానికి కుంకుమపువ్వు అద్దుకున్నట్లు, లాలిస్తే రోహిణీకార్తిలో చల్లటి నీళ్ళు మొహాన గిలకరించుకున్నట్లు.....

స్కూల్లో మిగతావాళ్ళు ఆమెనెలా వూహించుకున్నారో, అంచనా వేసుకున్నారో వివేకానికి తెలీదుగానీ, తనలో తను మాత్రం పై విధంగా అనుకుని వూరట చెందటమే కాక, వుత్సాహపడ్డాడు – కొత్త వెలుగు, కొత్త ఆశల్ని నింపుకుని, నరాల్లోకి కొత్త రక్తాన్ని ఎక్కించుకున్నాడు. వాళ్ళ క్లాసులో మొత్తం నలభైకిపైగానే విద్యార్థులుండేవాళ్ళు. కాని వివేకానికి గాని, మాణిక్యానికి గాని మిగతావాళ్ళ ధ్యాసే వుండేది కాదు క్లాసులో

అడుగుపెట్టగానే వివేకం కళ్ళు ఆమెకోసం వెతికేవి. ఆమె కనిపిస్తే సరేసరి – లేని పక్షంలో అర్థంకాని కలవరం – కల్లోలం మాణిక్య గూడా అతన్ని చూడంగానే నిండుగా నవ్వేది.

వాళ్ళిద్దరి పరిచయం చిత్రంగా జరిగింది అప్పటివర్కు ఒకే క్లాసులో వున్నా ఆమెని గుర్తించనందుకు తనని తాను నిందించకున్నాడు.

ఒక రోజు ఇంట్లో చిన్న సంఘటన జరిగింది – వివేకానికి అతడి వొదిన రాత్రి మిగిలిపోయిన  అన్నం వొడ్డించింది జిహ్వాన్ని చంపుకోలేక “కాస్త వుడకన్నం వుంటే పెట్టవూ” అనడిగాడు. అంతే  – వొదినమ్మకి కోపం కట్టలు తెంచుకొచ్చింది. అతడ్ని నానా మాటలు అని ఆపైన ఏడ్చింది సుందరమూర్తి తమ్ముడ్ని కేకలేసి, పెట్టిందేదో తినాలి గాని, వొంకలు పెట్టి వొదిన్ని బాధపెడతావుట్రా రాస్కెలని, గుడ్లెర్రచేసేడు. వివేకానికి ఆకలి చచ్చిపోయింది. చచ్చిపోయిన అమ్మ గుర్తుకొచ్చింది. వీధిగదిలో వున్న తల్లి ఫోటోముందు రెండు క్షణాలు నిల్చున్నాడు. ఆ ఫోటోకిదివరలో అన్నయ్య ప్రతిరోజూ వూదుకడ్డీ వెలిగించి చేతుల జోడించేవాడు. ఆ పొగకి, దమ్ముకి ఫోటో అద్దం నల్లబడింది. ఆ నల్లటి అద్దం వెనుకునించి ఒక ఆడమనిషి వివేకాన్ని చూసి, ‘ అంతేరా – అంతే ప్రపంచం నైజమేయింత, కళ్ళు తుడుచుకో – బాధపడకు – ప్చ్– ఏం చెయ్యను’ అంటూ ఓదార్చి బాధపడినట్లు అన్పించి, కళ్ళనీళ్ళతోటే వీధిలోకెళ్ళాడు.

ఎప్పుడూ మొదటి బెంచీపైన కూర్చునేవాడు, ఆ రోజు చివరి బల్లకి మారేడు. మాస్టర్లు వస్తున్నారు – పోతున్నారు వివేకం మాత్రం బల్లపైన  తల పెట్టుకుని ఏడుస్తూ వుండిపోయేడు. స్కూలయిపోయింది. పిల్లలంతా వెళ్ళిపోయేరు. వివేకం మాత్రం అలాగే రోదిస్తున్నాడు. కాస్సేపటికి ఎవ్వరో తన ప్రక్కనున్నట్లుగా అన్పించి, అన్నయ్యేమో నన్న ఆశకొద్దీ తలెత్తిచూసేడు. అన్నయ్యకాదు, ఆమె పూల పూల పరికిణీ, తెల్లటి బ్లౌజు, కనకాంబరరం కలర్ పావడా – మెళ్ళో పూసలవండ, మొహాన సానుభూతి తాలూకు ఛాయలు.

వివేకం ఆమెని చూడంగానే కంగారుపడ్డాడు. కళ్ళు తుడుచకుని లేచి నిల్చున్నాడు.

“ ఎందుకలా వుదయంనించి బాధపడుతున్నావ్ ? ” – అదీ ఆమె వేసిన మొదటి ప్రశ్న. వివేకానికి ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో, అసలు చెప్పాలో వద్దో కూడా అర్థంకాక వెర్రిగా  చూస్తూ నిల్చుండిపోయేడు.

“ ఫ్రెండ్సంతా వెళ్ళిపోయేరు నాకు ఒక్కత్తిని ఇంటికెళ్ళటానికి భయం కాస్త సాయం వస్తానా ” అనడిగింది,

ఆమె చనువుకి, ధైర్యానికి వివేకం ఆశ్చర్యపడ్డాడు.

ఇద్దరూ బయటికొచ్చి నడుస్తుంటే ఆమె మళ్లీ అడిగింది.

" నీకు అమ్మానాన్నా లేర్టగా " అని.

ఆమాట వినగానే అతడికి మళ్ళీ ఏడుపు ముంచుకొచ్చి. అతికష్టం పైని పెదాలమధ్యనే బిగపట్టుకుంటూ అవునన్నట్లుగా తలూపేడు.

" నాకూ అమ్మలేదు. నాన్న, అన్నయ్య వున్నారు " అంది.

ఇద్దరూ నడుస్తున్నారు. ఇపుడు వివేకం ఆలోచన్లు వుదయం ఇంట్లో జరిగని సంఘటనని వొదిలి, మాణిక్య చుట్టూ తిరుగుతున్నాయ్.

" నా పేరు మాణిక్యం, నీ పేరు వివేకానందం కదూ"

వివేకం ఆశ్చర్యంగా మళ్ళీ తలాడించేడు. కాస్త దూరం వెళ్ళేక తిరిగి ఆమె అంది.
" మగవాళ్ళలా ఏడవకూడదు – అసహ్యంగా ఉంటుంది ".

ఎలా ఏడవాలో చెప్పమని అడుగుదామనకుని ధైర్యం చాలక మౌనంగా వుండిపోయేడు.

ఇంకో రెండడుగులు వేసి ఆమె ఆగింది – వివేకం వైపుగా చూస్తూ " ఈ ప్రక్కనే మా ఇల్లు . అన్నయ్యగానీ ఇద్దర్నీ చూసేడంటే మంచిదికాదు. నీ బాధని కాస్సేపు మరిపించాలని రమ్మన్నాననే గాని నిజంగా భయంవల్ల కాదు అంచేత ఇంటికెళ్ళు ధైర్యంగా వుండు. మళ్ళీ ఏడ్చినట్లు తెలిస్తే ఇక నీతో నే మాట్లాడను – వస్తా " అనేసి ఏవీ ఎరగనట్లు విసవిసా వెళ్ళిపోయింది.

వివేకం ఆలోచిస్తూ చాలా సేపు అక్కడే నిల్చుండిపోయేడు. కొద్దిసేపటి పరిచయం. ఏడిస్తే నీతో మాట్లాడననటానిక్కారణం, దానిలోని ఆంతర్యం – బెదిరింపా ? చనువా ? మిక్కిలి ఇష్టంలోంచి వచ్చే అధికారమా ?

అర్ధం కాలేదు వివేకానికి.

కానీ ఒక్క విషయం మాత్రం స్పష్టమైంది. మాణిక్య ప్రక్కనుంటే బాధ మంచుముక్కలా కరిగిపోయింది.

ఆరోజునించి వివేకానికి తెల్లవారేది ఆమెకోసం, స్కూలుకెళ్ళేది ఆమెకోసం, రాత్రి ఆలోచనల్లు ఆమె గురించి – ఇద్దరూ వీలుచిక్కినప్పుడల్లా వూరు బయట కొండలెక్కేవాళ్ళు. ఇపుడతనికి ఏ బాధలూ, కష్టాలు లేవు వొదిన మూడ్రోజుల్నాటి అన్నం పెట్టినా, అన్నయ్య ముక్క చివాట్లేసినా ముసిముసి నవ్వుల్తో బయిటికొచ్చేస్తున్నాడు

ఒక సాయంత్రం వివేకం అడిగాడు. " మాణిక్యం నేనోమాటడుగుతా నిజం చెప్పాలి సుమా "

" ఏమిటి ? " అమాయకంగా అడిగింది.

" నేనంటే నీకిష్టమేనా ?" పరీక్షా ఫలితాలకై ఎదురుచూసే విద్యార్థిలా ఆదుర్దాగా చూడసాగేడు.

" వుహూ – ఇష్టం లేదు " అంది ముక్తసరిగా.

ఆకాశం ఫెళ ఫెళ మంటూ విరిగి నెత్తిన పడ్డట్టుగా తల్లడిల్లిపోయి " ఎందువల్ల ? " అని మాత్రం అనగలిగాడు.

ఆమె మాత్రం చాలా తాపీగా " ఏడ్చే మొగాళ్ళంటే నాకసహ్యం " అన్నది.

" నేనిప్పుడు ఏడ్వటంలేదు మాణిక్య వొట్టు " అమాయకంగా అన్నాడు.

" ఇంకెప్పుడూ ఏడవ్వుగా "

" వుహూ – కావాలంటే మళ్ళీ వొట్టు "

" సరే అయితే – " మాట పూర్తి చేయకుండానే ఫెళ్ళుమని నవ్వింది మాణిక్య.

వివేకానికి పోయినవూపిరి తిరిగొచ్చింది – " మరి నువ్వంటే నాకిష్టమేనాని అడగవేం మాణిక్యం " అన్నాడు.

" అడగను "

" ఎంచేత ? "

" నీ జవాబు నాకనవసరం కనుక " కాస్త సీరియస్సుగా అనేసి ఇంకో వైపుకి తిరిగి కూర్చుంది.

వివేకం ఆమె ధోరణి అర్థంకాక చొరవుగా  ఆమె రెండు బుజాలు పుచ్చుకుని తన వైపుకి త్రిప్పుకునే ప్రయత్నం చేస్తూ " ప్లీజ్ మాణిక్య – అలా మాట్లాడకు  నాకు ఏడుపొస్తోంది " అన్నాడు దీనంగా.

" ఏయ్ పెళ్ళికాని పిల్లని తాకవచ్చా – అన్నీ రౌడీ బుద్దులు వుండు మీ అన్నయ్యకి చెప్తా "

వివేకం వులిక్కిపడి ఆమెనొదిలి పది గజాలదూరం జరిగేడు. మాణిక్య తల త్రిప్పి అతడివంక చూసింది ఏడ్వడానికి సిద్ధంగా వున్న అతడి వాలకం గమనించి గలగలా నవ్వింది. అతడి క్కాస్త దగ్గరగా జరిగింది. చేతిని అందిపుచ్చుకుని ప్రేమగా నిమురుతూ ' పిచ్చి వివేకం ' అని మాత్రం అంది.

ఇదంతా రెండేళ్ళ క్రితం – జస్ట్ టు యియర్స్ బాక్ జరిగిందంటే వివేకానికి నమ్మశక్యం కాకుండా వుంది. నిన్నకాక మొన్న  జరిగినట్లు....

అన్నయ్య ఒకరోజు పిల్చి వెయ్యిరూపాయలు చేతిలో పెట్టి " మన వూళ్ళో స్థలం అమ్మగా  వచ్చినదాంట్లో నీ వొంతు. బట్టలే కుట్టించకుంటావో, బ్యాంకులో  దాచుకుంటావో నీ ఇష్టం. ఇదిగో ఈ కాగితాలపైన సంతకం పెట్టు " అనడిగినప్పుడు తళుక్కున  ఆలోచన రావటం, ఆ పారవశ్యంలో స్థలం ఎంతకమ్మేవ్, ఎంతొచ్చింది వగైరా ప్రశ్నలడక్కుండా సంతకం గెలికి బజార్లోకి పరిగెత్తేడు.

లెక్కలడుగుతున్నాడేమోనని భయపడ్డ దంపతులు తేలిగ్గా వూపిరి పీల్చుకున్నారు

ఆ సాయంత్రం వివేకం పనిగట్టుకుని మాణిక్యాన్ని దుర్గగుడికి తీసుకెళ్ళాడు. అమ్మవారి దర్శనం అయ్యేక, ఇద్దరూ ఘాట్‌రోడ్డుపైనుంచి  ప్రక్క ప్రక్కల్నే నడుచుకుంటూ క్రిందకొచ్చి బ్యారేజీ పార్కులో కూర్చున్నాక వివేకం అడిగేడు "మాణిక్య నీ చెయ్యి ఇలా ఇవ్వు" అని.

" దేనికి జోస్య చెప్తావా  ? " అనడిగింది చిలిపిగా చెయ్యివ్వకుండానే.

" కాదు  కాదు. కాస్త పనుంది"

" నాచేత్తో  నీకేంపని – అసహ్యంగా " చిరుకోపం ప్రదర్శిస్తూ అంది మాణిక్యం.

ఈసారి  అతడు ఏడుపుమొహం పెట్టకుండా, చొరవగా ఆమె చేతిని పుచ్చుకుని జేబులోంచి ఎర్రకాగితంలో చుట్టిన పొట్లంవంక మార్చి మార్చి చూస్తోంది.

వివేకం రెండు మూడు కాగితాలు పొరలు పొరలుగా విప్పి వాట్లోంచి ధగ ధగమెరుస్తున్న బంగారపు వుంగరాన్ని బయటికి తీసి ఆమె వేలికి తొడిగాడు.

" ఏమిటిది ? " వేలికున్న వుంగరం చూసుకుంటూ అడిగింది.

బంగారం కొత్త మెరుపులో తళతళలాడుతోంది ఎనామిల్ ప్లేటుపైన ' వి ' అనే ఇంగ్లీషు అక్షరం విజయ సంకేతంలా హుందాగా, అందంగా చెక్కబడుంది.

" వుంగరం. బంగారందే నీకోసం కొన్నా " గొప్పగా, గర్వంగా చెప్పాడు. ఆమె మెచ్చుకోవాలని, ఆత్రంగా ఎదరుచూసిన అతడికి నిరుత్సాహమే ఎదురైంది " ఇంత డబ్బు నీ కెక్కడిది ? " అనుమానంగా అడిగింది.

" మా అన్నయిచ్చేడు, స్థలం అమ్మిందాంట్లో నా వాటా "

" అయితే మాత్రం నాకెందుకూ ? నేనేం కొనిపెట్టమని అడిగేనా  ?"

" లేదనుకో – నా ఆనందం కోసమే – ఇంతకీ ఎలా వుంది. నీకు నచ్చిందా ' వి ' ఫర్ వివేకం. నా గుర్తుగా నీవద్ద  ఎప్పుడూ వుంచుకోవాలి ".

అతడు మాట్లాడటం పూర్తికాకుండానే, మాణిక్య వేలికున్న వుంగరం తీసేసి అతడి వొళ్ళోకి గిరాటేట్టసింది.

"ఇలాంటిపనెప్పుడూ చెయ్యక – అయినా రేపు కాలేజీలో చేరబోయేవాడివి మంచిబట్టలు కుట్టించుకోక, ఇలా డబ్బు తగలేస్తావా ? ఎలాగు కొన్నావు గాబట్టి నీవేలికే వుంచుకో. వెడదాం పద " లేచి విసవిసా సగం దూరం వెళ్ళింది.

వివేకం మొహం ఎర్రబడింది. వుంగరం చేతులోనే వుండిపోయింది. కళ్ళల్లో నీళ్ళు తిరగ్గా వెళ్ళిపోతున్న ఆమె వంకదీనంగా చూడసాగాడు.

మాణిక్య కాస్త దూరం వెళ్ళి అతడు రావటం లేదని గమనించి, వెనక్కి తిరిగి చూసింది.

వివేకం అలాగే కుర్చుండిపోయి, కళ్ళవెంట నీళ్ళు కారుస్తూ తనవంక చూస్తున్న తీరు ఆమెలో అతడిపట్ల పెంచుకున్న అభిమానాన్ని, అనురాగాన్ని, ఆప్యాయతని తట్టిలేపాయ్. రెండంగల్లో ఆమె వెనక్కి తిరిగి అతడ్ని సమీపించి. ప్రక్కనే కూలబడింది " నిన్ను బాధపెడితే క్షమించు వివేకం. డబ్బు వృధా చేశావన్న వుద్దేశ్యంతోనే అలా అన్నానే గానీ వేరే భావంతోకాదు నీ ఆనందంకోసం, సంతోషం కోసం ఏదైనా చేస్తా – చెప్పు వివేకం. కానీ నువ్వలా బాధపడొద్దు. దొరబాబులా ఎప్పుడూ నవ్వుతూ వుండాలి. అదే నా ఆశ " మాట్లాటం ఆపి తలని అతడి భుజానికి ఆన్చి కళ్ళు మూసుకుంది – తన కళ్ళల్లో తడి అతడు చూట్టం ఇష్టంలేనట్లు.

వివేకానికి జారిపోయిన వుత్సాహం రెట్టింపు బలంతో వచ్చింది. ఆమె చేతిని తీసుకుని వుంగరాన్ని తిరిగి వేలికి తొడిగి – " మాణిక్యం – నా జీవితానికి ఒకే ఒక ఆశ – నువ్వు ! నువ్వులేని జీవితం – అర్ధంలేని పిచ్చిగీత. ప్రపంచంలో నాదంటూ ఏదైనా వుందంటే– అది నువ్వే. జీవితంపైని ఆశని పుట్టించింది నువ్వే – నువ్వు కాదంటే ఈ వివేకం నీక్కనిపించడు"

" అంత మాటనకు – అయినా నీలాంటి యోగ్యుడితో పరిచయం కావటం నా అదృష్టం. ఇవన్నీ ఆలోచించక – నువు బాగా చదువుకోవాలి. పెద్ద వుద్యోగస్తుడివి కావాలి. ఆపైన మిగతా విషయాలు తెల్సిందా ? "

వివేకం ఆమె చేతికున్న వుంగరాన్ని పరీక్షగా చూస్తూ, తన్మయుడవుతూ – " మాణిక్యం ! ఈ వుంగరాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ విడనాడనని మాటియ్యి " అనడిగాడు.

మాణిక్యం అతడి చేతిలోని తన చేతని విడిపించుకుని వుంగరం వంక చూసుకుంటూ – " దీని విలువ రూపాయిల్లో ఎంతో నాకు తెలీదు గానీ, నాకు మాత్రం ప్రాణంతో సమానం. వుంగరంపోయిందంటే మాణిక్య పోయినట్లేనని గుర్తుంచుకో "

ఆమెని మాట్లానివ్వకుండా వివేకం నోటికి చెయ్యి అడ్డంపెట్టేడు.

ఇది గూడా రెండేళ్ళ క్రింత – జస్ట్ టు ఇయిర్స్ బాక్ జరిగిందే !

ఆ తర్వాత వివేకం కాలేజీలో చేరబోతుండగా  జరిగిన ఓ సంఘటన వాళ్ళ జీవితాలనే మలుపుతిప్పింది.

ఆ రోజు సాయంత్రం వివేకం వొంటరిగా మున్సిపల్ గ్రౌండ్స్ వైపుగా వస్తున్నాడు. మాణిక్య అన్న – అతడిపేరు నరహరి, మరిద్దరితో వచ్చి ఎదురుగా నిల్చున్నాడు.

నరహరికి చెప్పుకోవటానికి బోల్డంత చరిత్రుంది. ఫస్టుఫారంలో వుండగానే బీడీలు తాగి, ఫోర్త్‌ఫారంలో కొచ్చేసరిక సిగిరెట్లు త్రాగేవరకు ఎదగిపోయేడు. ఇంకాపేకాట, దాంట్లో గెలిస్తే వ్యభిచారం, వోడితే తాగటం మొదలైన కళల్లో ఆరితేరి, చదువురాక, తనలాంటి వాళ్ళతో జట్టు తయారుచేసి  మాష్టర్లని, ఆడపిల్లల్ని ఏడ్పించటం – తరచు  డిబార్ కావటం, ఇంకొన్నాళ్ళకి స్కూలు నించి బయటికొచ్చి రాజకీయ పార్టీలతో పొత్తుపెట్టుకుని, దొమ్మీవీరుడిగా పేరు పొంది, పోలీసు వారికి చాలా కావాల్సిన వాడై ప్రస్తుతం బయట ప్రపంచంలో  వున్నాడు.

అంతటి చరిత్రకారుడైన నరహరిని చూసేసరికి వివేకానికి కాళ్ళూచేతులు చల్లబడ్డాయ్.

“ ఏరా – పార్కులకి, రోడ్లవెంట తిప్పటానికి  నీకు నా చెల్లెలే దొరికిందా ? నేనెవరో నా సంగతేవిటో తెల్సా ” వురిమి చూస్తూ అడిగేడు.

వివేకానికి భయంవల్ల నోట్లోంచి మాటరాక “ ప్రే.....మ ....... ప్రేమిస్తున్నా ” తడబడుతూ సమాధానమిచ్చేడు.

ఆ మాటకర్థం తెలీదు కాబట్టి నరహరి మరింతగా పెట్రేగి “ ప్రేమా ? నీకెన్ని గుండెల్రా నా చెల్లెని ప్రేమించటానికి. తల్చుకుంటే నిన్నేం చేస్తానో తెల్సా ? ” అతడి చొక్కా కాలర్ని బిగించి పట్టుకుని గుంజుతూ అడిగేడు .

వివేకం మరింత వొణికిపోతున్నాడు. “ మళ్ళీ ఎప్పుడన్నా కలుస్తావా చెప్పవేం ? ” నరహరి గద్దింపుకి  ఏం చెప్పాలో తెలీక  నిస్సహాయంగా నిల్చుండి పోయేడు . అంతలో నరహరితో పాటుగా వచ్చిన ఇద్దరిలో ఒకడు “ ఆడ్ని అడిగేదేంట్రా నాలుగు పీకండి నా కొడుక్కి బుద్దొస్తుంది ” అన్నాడు.

వివేకం కాస్త ధైర్యాన్ని కూడగట్టుకుంటూ “ నేనేం తప్పుచేసానని కొడతారు ? అనడిగాడు.

“ ప్రేమించటం తప్పా ? ” అని గూడా అడిగాడు.

ఆమాట వినంగానే నరహరికి ఆవేశం అమాంతంగా వచ్చి పడింది. “ మళ్ళీ అదేమాట యెదవనాకొడకా ” అంటూ వివేకాన్ని  బలంగా వెనక్కినెట్టి. క్రిందపడ్డ అతడ్ని

పైకి లేవనీకుండా అదిమి పట్టి " ప్రాణాలు తోడేస్తా నీ –" తల్లిని తిడుతూ బూతుపదాన్ని వాడేడు.

అంతే !

అంతే జరిగింది !

వివేకంలో ఏ అణువు ఫేడీల్న బ్రద్దలయ్యిందో, ఏ నరానికి నిప్పంటుకుని గుండెలు మండిపోయాయో, తెలీదుగానీ – మొహం ఎర్రబడింది నరాల్లో నెత్తురు సలసలా కాగిపోయింది. ఎముకలు ఇనుపచువ్వల్లాగా బిగుసుకున్నాయ్.

దేవుడు కంటికి కనిపించడు కనకనే మనకి ఆయనంటే భక్తి, నమ్మకం. అదే దేవుడు దిగొచ్చి మన భుజాల్న చెయ్యేసి తిరిగితే కాలక్రమేణా ఆయనపైన గురి, గౌరవం, తగ్గిపోయే ప్రమాదంవుంది. వివేకానికి జన్మనిచ్చిన దేవతని చూసే అదృష్టం లేకపోవటం చేత, ఆ రెండక్షరాల దేవతని. దైవం కన్నా మిన్నగా వూహించుకుని పూజించుకుంటున్నాడు. అటువంటి తల్లిని తిట్టినందుకు  కోపంతో పరశురాముడయ్యేడు " ఏవిట్రా కూసేవ్ – ఏదీ మళ్ళీ అను " పెద్దగా అరిచాడు.

నరహరి, అతడి మిత్రులు గూడా ఆ తిరుగుబాటుని  సహించలేక మీదకి లంఘించబోయేరు.

వివేకం వాళ్ళకావకాశం ఇవ్వకుండానే, ప్రక్కనున్న బండ రాయినెత్తి ఆవేశంతో " చావండి " అంటూ బలంకొద్దీ విసిరేడు

మరుక్షణం నరమరి " అమ్మా " అంటూ కూలబడిపోవటం, నెత్తురు వరదైల ప్రవహించటం, జనం పోగవటం, వాళ్ళల్లోంచి ఎవ్వరో  " బ్రతకడం చాలా కష్ట. దెబ్బ బలంగా తగిలింది. అయినా  ఎందుకైనా  మంచిది త్వరగా ఆస్పత్రికి తీసికెళ్ళండి  " అన్ని క్షణాలపైన జరిగిపోయినాయ్.

వివేకానికి కోపం పోయి.....భయం ...నల్లత్రాచులా చుట్టేసింది. నరహరి చచ్చిపోతాడు..... పోలీసుల, కేసు , జైలు, అన్నయ్య కేకలు .....వెళ్ళిపోవాలి...ఎవ్వరికి అందకుండా ....ఆచూకీ తెలీకుండా ....వెళ్ళిపోవాలి ...పారిపోవాలి.

రెండేళ్ళ క్రితం జరిగిన ఈ సంఘటన వివేకాన్ని వెంటతరిమి పారిపోయేలా చేసింది. ఆ రోజు, అదే క్షణం , ఇంటికెళ్ళి వొదిన లేదని తెల్సుకుని, ఇల్లంతా గాలించి దొరికిన యాభైకాగితాన్ని చేత్తో పుచ్చుకుని రైల్వేస్టేషన్కెళ్ళి రెడీగా వున్న రైలెక్కితేగాని ప్రాణం కుదుటపడిందిగాదు.

రాజధాని చేరి నానా తిప్పలు పడి, తిండిలేక నీళ్ళు త్రాగి, పేవ్‌మెంట్లపై పడుకుని – చాలా రోజులు కాలక్షేపం చేసేడు. చివరికో షాపు యజమాని జాలిపడి ప్యూనుగా వుద్యోగమిచ్చి, ఇటీవలే గుమాస్తాగా ప్రమోట్ చేసేడు.

పేరు, వూరు మార్చుకుని అజ్ఞాతంగా వుండగలిగాడు గాని, మనసుని లాలించి, సమాధానం చెప్పలేకపోయేడు. ప్రతిక్షణం మాణిక్య గుర్తుకొచ్చేది. చాలాసార్లు ఆమెకి వుత్తరం వ్రాయాలని పోస్టాఫీసు దాకా వెళ్ళటం – తీరా అక్కడిదాకా వెళ్ళాకా మళ్ళీ భయం – తన వునికి తెల్సిపోయి రక్షణ లేకుండా పోతుందని – అంతె వెనకొచ్చేసి, గదిలో పడుకుని " నన్ను క్షమించు మాణిక్యం. ధైర్యాన్ని కూడగట్టుకునే ప్రయత్నంలో వున్నా, నా ప్రయత్నం ఫలించిన నాడు నీముందు వ్రాలి నీ క్షమాపణలు కోరుకుంటా " అనుకునేవాడు.

వివేకానికి తనలోని పిరికితనం పోవటానికి, స్వార్ధం తగ్గటానికి, ప్రేమ విలువ తెలీటానికి రెండేళ్ళు పట్టింది.

అంచేత ఇంటికి ప్రయాణం కట్టేడు.

☆ ☆ ☆

విజయవాడలో రైలు దిగేసరికి మాధ్యాహ్నమైంది. ఫ్లాట్‌ఫాంపైనే కాస్సేపు నిల్చుని మారిపోయిన పరిసరాలనన్నిటిని వింతగా చూసేడు వివేకం తనూ మాణిక్యం అనేక సాయంకాలాలు నడుచుకుంటూ వెళ్ళిన రైలు పట్టాలు, కూర్చున్న సిమెంటుబల్ల – వాటి కేసి నిండుగా చూసుకున్నాడు – రెండేళ్ళల్లోనే స్టేషను బాగా అభివృద్ధి పొందింది – మనుషుల్లో కూడా బాగా మార్పొచ్చింది. పంపు తిప్పుకుని కడుపునిండా నీల్ళు తాగేడు. తర్వాత వేడి వేడి నీళ్ళ కాఫీగూడా తాగేడు.

పెట్టె పుచ్చుకుని స్టేషను బయటికొచ్చేడు.

సుందరమూర్తి ఇదివరలో సత్యనారాయణపురంలో వుండేవాడు .రిక్షా ఎక్కికూర్చున్నాక అనుమానం కల్గింది – అన్నయ్య ఇల్లుగానీ మారేడేమోనని. రిక్షా ఇరుకువీధులగుండా తుపాకీ గుండులా దూసుకెళ్ళిపోతుంటే వింతగా చూస్తున్న అతడికి లోపల్లోపల పూర్వపు భయం – నరహరి చిచ్చపోయాడా ? ఇంకా పోలీసులు తనకోసం గాలిస్తున్నారా ? తెలివితక్కువగా వాళ్ళ చేతుల్లోగాని వెళుతున్నాడా ?

ఇంకో ప్రక్కన ప్రయాణానికి వురికొల్పిన మొండిధైర్యం.

పోలీసులకి చిక్కినా బాధలేదు – కాని మాణిక్యాన్ని కళ్ళారా చూసుకోవాలి. నోరారా పలకరించాలి. ఆపైన తనకేమైనా పర్వాలేదు.

ఇంటిక్కాస్త దూరంలోనే రిక్షా దిగి, ఇంటికేసి అడుగులేస్తుంటే అర్థంకాని వుద్వేగంలోంచి పుట్టుకొచ్చి సన్నపాటి వొణుకు.

వెళ్ళి గడపలోనిల్చుని తలుపు తట్టేడు.

కొద్ది క్షణాలు నిశ్శబ్దం.

మళ్ళీ తలుపుతట్టగా లోపల్నించి " ఎవరూ – వస్తున్నా " అని ఓ ఆడ కంఠం ప్రశ్న వినిపించి, ఆ గొంతు వొదినదేనాని ఆలోచిస్తుండగానే తలుపు తెరుచుకుంది.

వివేకం రూపురేఖల్లో ఇపుడు చాలా మార్పొచ్చింది. మొమంలో ముదురుతనం, నిండుగా పెంచిన కోరమీసం, మెడల వరకు జూలపాల్లాగా పెంచిన జుట్టు. ఇపుడు పోలీసులకైనా అతడ్ని పోల్చుకోటానికి పది నిమిషాలు పడుతుంది. కానీ అతడి వొదిన పోలీసులకన్నా రెండాకులు ఎక్కువ చదివింది కాబట్టి రెండు క్షణాల్లోనే గడపలో నిల్చున్న మరిదిని పోల్చుకుంది.

పోల్చుకున్నాక ఒకే క్షణం. ఆమె కళ్ళల్లో వెలుగు కనిపించి వెంటనే చప్పున చల్లారిపోయింది. లోపలికి తప్పుకుంటూ " నువ్వా. ఇప్పటికి ఇల్లూ, అన్నయ్యా గుర్తొచ్చేరన్నమాట " అంది నిష్టూరంగా.

వివేకం లోపలికొచ్చి అక్కడున్న ఫ్రేంకుర్చీలో కూర్చున్నాడు.

" ఎక్కడికెళ్ళావ్ ? ఏవైపోయావోనని మీ అన్నయ్య ఒకటే దిగులు. అక్కడికి నే చెబుతూనేవున్నా – మీ తమ్ముడు మీకన్నా . నాకన్నా తెలివగలవాడు. ఎక్కడున్నా నిక్షేపంలా వుంటాడూ – అని అయినా ఓ కార్డుముక్క రాసి పడేస్తే నీ సొమ్మేంపోయిందిట. నిన్నేదో నేను తిండిపెట్టక రాచి రంపాన పెట్టాను, అంచేత వెళ్ళి పోయావని చుట్టు ప్రక్కలవాళ్ళంతా చెవులు కొరుక్కోవటం "

" అన్నయ్య లేడా ? " ఆమె వాగ్తోరణికి అడ్డుపడుతూ అడిగేడు.

" ఆఫీసేకెళ్ళారు – ఇంతకీ భోజనం చేసేవచ్చావా ? "

వుదయం కేవలం కాఫీ త్రాగి రైల్లో కూర్చున్నాడు. ఆకలి దంచేస్తోంది. కానీ ఆమె అడిగిన పద్ధతి వివేకంలోని ఆకల్ని అసహ్యంగా మార్చేసింది.

" రైల్లో తినొచ్చా " అన్నాడుపొడిగా.

ఆమె గొణుక్కుంటూ లోనికెళ్ళిపోయింది.

వివేకం కుర్చీలోంచి లేచి ఇల్లు నాలుగువైపులా పరీక్షగా చూసేడు. ఇదివరలో లేని సామాన్లు చాలా వచ్చేయ్. అమ్మ ఫోటో వుండాల్సిన చోట కనిపించక అతడు లోపలిగదిలోకి తొంగిచూసేడు.

దూలానికి వ్రేలాడ తీసిన వెదురుబద్దల వుయ్యాల – దాంట్లో ఆదమరిచి నిద్రపోతున్న పసిపాప.... కనిపించగా వుత్సాహంగా లోనికెళ్ళాడు. పిల్ల ఎర్రగా, అందంగా, బొద్దుగా వుంది. తలంతా నల్లటి జుట్టు. సహజమైన వాత్సల్యతో పిల్లని చేతుల్లోకి తీసుకోబోయినంతలో , వెనకనించి వొదిన గొంతు వినిపించింది.

" దాన్ని కాస్సేపు పడుకోని ....ఏడ్చి ఏడ్చి ఇప్పుడే పడుకుంది. ఏ వర్జ్యం వేళ పుట్టిందోగాని ఒకటే ఏడుపు – పాపిష్టిపిల్ల. ప్రాణాలు తోడేస్తుంది – అంతా మీ అమ్మగారి పోలికని మీ అన్నయ్య పొంగిపోతున్నారు గాని, నా వోపికంతా నశిస్తోంది. కాస్సేపు పడుకోనియ్యి ".

ఇపుడామె తిట్టింది పిల్లనో, తన తల్లినో వివేకానికర్థమయ్యి కోపం బుసబుసా పొంగింది. సమాధానం చెప్పటానికి నోరు తెరవబోయి, ఎదురుగా మూలగా, గోడకి వ్రేలాడుతున్న తల్లి ఫోటోని చూసి గొంతులోని మాటని మింగేసి అటువైపుగా వెళ్ళేడు.

మూలగా, గోడకి తల్లిఫోటో వ్రేలాడుతోంది – దానిపైన వొదినవాడే జడ సవరం పొడుగ్గా వ్రేలాడుతోంది – వివేకం ఆ సవరాన్ని తీసి కోపంగా నేలకేసి కొట్టేడు – ఫోటో అద్దం మరింత నల్లబడింది. లోప ఫోటోకి చెదలు పట్టి తెల్లగా పాలిపోయి రూపురేఖలు గుర్తించటం కష్టంగా తోచింది అతడు అద్దాన్ని చేత్తో శుభ్రం చేసాడు. కళ్ళు మూసుకున్నాడు. " ఏరా, ఎక్కడికెళ్ళావ్ – నేనెంత కుమిలిపోయానో తెల్సా ? అదేవిటలా చిక్కిపోయేవ్ " అంటూ పలకరిస్తున్న కన్న కడుపుని వూహించుకుని కళ్ళల్లోకి మరిన్ని నీళ్ళు తెచ్చుకున్నాడు – అలాగే చివుక్కున వెనక్కి తిరిగి, చెప్పులు తొడుక్కుని వీధిలోకి వచ్చేసాడు

జేబులోంచి కర్చీఫ్ తీసి కళ్ళు తుడుచుకున్నాడు. రెండు చేతులు ఫ్యాంటుజేబులో వుంచుకుని వీధివెంట నడిచి వెడుతున్నాడు.

ఆలోచన్లు మళ్ళీ మాణిక్యంవైపుగా పరిగెత్తినాయ్. సరాసరిగా ఆమె ఇంటికెళ్ళి చూడాలని ఒక్క క్షణం మనస్సు తొందరపెట్టింది. కానీ మరుక్షణం అసలేం జరిగిందో తెల్సుకోకుండా వెళ్ళటంమంచిది కాదన్న విజ్ఞత.

రైలు గేటుకానుకుని కాస్సేపు ఆలోచించేడు – నరహరి గురించి, మాణిక్య గురించి తనక్కావాల్సిన సమాచారం చెప్పే వారెవరాని – అలా కాస్సేపు ఆలోచించిన మీదట స్ఫురణలోనికొచ్చిన వ్యక్తి – ఆచారి.

ఆయన పూర్తిపేరు శేషాచారి. పగలంతా ఆయుర్వేద వైద్యం, సాయంకాలాలు గుళ్ళో

అర్చకత్వం – రెండూ నిర్వహిస్తూ సెభాషనిపించుకుంటున్నారు అటు దైవబలాన్ని, ఇటు వైద్య బలాన్ని ప్రజలకందించాలన్న ధృఢ సంకల్పంతో వున్నట్లుగా వుంటాయ్ చల్లటి చూపులు – ఎర్రగా, ఎత్తుగా, తెల్లటి గుబురు గడ్డం, పగలు ఖద్దరు, సాయంకాలాలు ఎర్రపట్టువస్త్రాలు ..... చెరగని చిరునవ్వు – తిట్టినా, పొగిడినా గూడా ఒకేలా నవ్వగల నిండు మనిషి.

వివేకం నిల్చున్న చోట్నించి కదిలి చకచకా ఆయన షాపు వైపుగా వెళ్ళేడు. షాపు తెరిచే వుంది.... ఆచారి మందులు తయారీలో తలదించకోనుండటం చేత గడపలో నిల్చున్న వివేకాన్ని గమనించేడుకాదు. గమనించేక గూడా గుర్తించటానికి కాస్సేపు పట్టింది– గుర్తుపట్టేక చాలా ఆదరంగా ఆహ్వానించేడు – " నువ్వురా వివేకం – అబ్బో పెద్ద వాడివయ్యావ్ ..... అవునూ చెప్పాపెట్టకుండా వెళ్ళిపోయూవుటా మీ అన్నయ్య ఒకటేగోల. అరె – అలా నిల్చుండిపోయేవ్ లోపలికిరా "

వివేకం లోనికెళ్ళి చెక్కబల్లపై కూర్చున్నాడు తన సందేహ నివృత్తికై తగిన సమయంకోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు.

ఆచారిగారు మందులు నూరుకుంటూనే అనేక విషయాల గురించి చెపుతున్నారు పడిపోయిన దేవాలయపు ప్రహరీగురించి, వస్తున్న ధనుర్మాసం గురించి, ప్రజల్లో అ అడుగంటిపోతున్న దైవ భక్తి గురించి....

వివేకం వుండబట్టలేక " నరహరి ఎలా వున్నాడు ? " అనడిగాడు.

ఆయన మాట్లాడటం, మందులు నూరటం రెండూ ఆపి తలెత్తి అర్ధంకానట్లు చూస్తూ " ఏ నరహరి ? " అనడిగాడు.

" నరహరని – అదే మాస్కూల్లో చదివే మాణిక్య అన్నయ్య " అక్కడతో ఆపేసి ఆత్రంగా చూడసాగేడు. ఆయన చెప్పబోయే సమాధానం పైనే తన రెండేళ్ళ భయం నిజంకావటమో, కాకపోవటమో అన్నది ఆధారపడుంది.

" నరహరంటే – గంగయ్యకొడుకుకేగా ? అదేరా నీతోపాటుగుళ్ళోకొస్తుండే పిల్లదాని అన్నయ్యేగా ? "

" అవునవును – వాడే ! "

" వాడికేం అయిందని – నిక్షేపంగా వుంటేను "" చాలా తేలిగ్గా అనేసి తిరిగి తనపన్లో పడ్డాడు

ఆయన చెప్పిన ఆ చిన్నిమాట అతడి గుండెల్లో పేరుకున్న భయాన్ని పటాపంచెలు చేసి, ఆనందాతిశయాన్ని రేపింది. రెండేళ్ళ తర్వాత మొదటిసారి వెలుగు చూసిన వాడిలా వెర్రి ఆనందాన్ననుభవించేడు. ఇపుడు తనెవరికి భయపడనక్కర్లేదు. తను హంతకుడు కాదు.

పెల్లుబికి వస్తున్న సంతోషాన్ని మాటల్లో చెప్పలేక అలాగని  తనలో ఇముడ్చుకోలేక చివాల్నలేచి నిల్చున్నాడు. కాలు బయటికి వేస్తూ " మాణిక్యాన్ని కలవాలి – వెళ్ళొస్తా " అన్నాడు.

అతడిధోరణిలో వచ్చిన విచిత్రమార్పుకి ఆచారి ఆశ్చర్యంగా చూస్తూ " నీ బొంద – చెప్పేది పూర్తిగా వినిపించుకోవేం ? ఇంకెక్కడి మాణిక్య. అదేనాడో మట్టిలో కల్సింది "

స్వార్ధం చేత కల్పించుకున్న కృత్రిమభయంలోంచి  బయటపడ్డ ఆనందం నీటిబుడగలా పేలిపోయింది. కఠినమైన వాస్తవికత కత్తిపోటులా దిగింది.  గుండె ఇనుపముద్దలా  బరువుగాను, కాళ్ళు చేతులు కాగితపుపీలికల్లా  తేలిపోతున్నట్లుగాను అనిపించింది. శరీరంలోని రక్తమంతా  నీళ్ళుగా మారిపోయి, కళ్ళకి చిల్లులు పడ్డట్లుగా వర్షించసాగేయ్.

అతడలాగే శిలాప్రతిమలా నిల్చుండిపోయి, బల్ల అంచులు పుచ్చుకుని తలవొంచుకుని ఏడుస్తున్నాడు – నిశ్శబ్దంగా. ఇన్నాళ్ళు తనకోసం ఏడ్చిన అతడికి, కావాల్సిన వారికోసం కంట తడిపెట్టటం కొత్త అనుభవం.

అతడి పరిస్థితిని గమనించిన ఆచారి ముందుకంగరు పడి, తర్వాత అర్థంచేసుకున్నాడు. అతడ్ని భుజాలు పట్టి కూర్చోపెడుతూ " అలా బాధపడకు – దాని బతుకు అది తెల్లవార్చుకు వెళ్ళింది. అయినా నువ్వలా పరారవ్వకుండా వుంటే బతికేదేమో ?" అన్నాడు కాస్త మందలిస్తున్న ధోరణిలో.

వివేకం తలెత్తి ఆయనవంక అయోమయంగా చూసేడు.

" అవును – ఆరోజు నువ్వు ఆ నరహరిగాడిని చితకబాది పరారయ్యావా ? వాడేమో పదిరోజులు ఆస్పత్రిలో  వుండి బయటికొచ్చి మోచెయ్యంత కత్తిని బొడ్లో పెట్టుకుని నీకోసం గాలించేడు. వాడి రక్తం  కళ్ళ చూసిన వాడ్ని వాడొదిలిపెట్టడు. కనిపించిన  ప్రతి వాళ్ళని అడిగాడు.  చుట్టుప్రక్కల వూళ్ళన్నీ  తిరిగాడు. మాణిక్యం ఎంత భయపడిందని నీగురించి. పిచ్చిపిల్ల రోజూ గుళ్ళోకొచ్చి నువ్వు వాళ్ళన్నయ్య కటంపడకుండా చూడమని ఆ దేవుడ్ని ప్రార్ధించేది. నీ పేర్న  అర్చనలు అభిషేకాలు చేయించింది – ఆ నరహరిగాడ్ని  కొట్టి నువ్వింకా బ్రతికున్నావంటే ఆమె పూజలేకారణం "

" ఇంతకీ మాణిక్య ఎలా పోయింది ? " కళ్ళు తుడచుకుంటూ అడిగేడు వివేకం.

" అదే చెపుతున్నా – ఆ నరహరిగాడు నీకోసం గాలించి విసుగెత్తి  చివరకి నీ గురించి చెప్పమని చెల్లెల్ని బాధించటం మొదలెట్టాడు. నిశ్శబ్దంగా అన్ని భాదల్ని భరించింది. చివరికి  వాడికేం  చెయ్యాలో. ఎలా నీపై  కసితీర్చుకోవాలో తెలీక. చెల్లెల్ని తన జట్టులో ఒక

తాగుబోతు వెధవకిచ్చి పెళ్ళిచేసేడు ”

“ ఏవిటి మాణిక్య పెళ్ళిచేసుకుందా ? ” అంతటి దు:ఖంలోనూ ఆశ్చర్యంగా అడిగాడు.

ఆచారి అతడివంక ఇంగీషు మందులవంక చూసినట్లుగా అసహ్యంగా చూస్తూ “ చేసుకోక ఏం చేస్తుంది ? ఆడపిల్ల, తండ్రి పోయేడు అన్నేమో కత్తిగట్టేడు. దాని గోడువినే నాధుడెవ్వడు ? అసలు దాని పెళ్ళయ్యాకే నరహరి నీకోసం వెతకటం మానుకున్నాడు ”

“ ఇంతకీ ..... మాణిక్యం ....”

“ ఎలా పోయిందని గదూ అడిగావ్ – అదే చెపుతుంట దాని పెళ్ళయ్యాక ఆ నరహరిగాడు దొమ్మీ గొడవల్లో జైలుకెళ్ళాడు. ఆ మాణిక్యాన్ని కట్టుకున్న వెధవ చేస్తున్న వుద్యోగం మానేసి పగలు, రాత్రి తాగేసి పడుకోవటం మొదలెట్టాడు – ఆడపిల్ల ఏం చేస్తుంది ? దిగులు పడేది. ఏడ్చేది పెళ్ళయిన రెండు నెల్లకే పీనుగులా తయారైంది. అప్పుడప్పుడూ గుళ్ళోకొచ్చి స్తంభానికి జారిగిల పడి కూర్చునేది..... ఏమే మాణిక్య కులాసాయేనా అంటే అదోలా నవ్వి. వివేకం గురించి ఏవన్నా తెల్సిందాని అడిగితే – ఎక్కడున్నాడో ఏం చేస్తున్నాడోనని వలవలా ఏడ్చేది ”

వివేకం బల్లపైన తలాన్చి పడుకున్నాడు అతడేడుస్తున్నాడని ఎగిరెగిరి పడుతున్న ప్రక్కటెముకలు, వెక్కిళ్ళశబ్దాలు సాక్షికాలు ఆచారిగారు చెప్పుకుపోతున్నారు.

“ ఇంతకీ ఏం జరిగిందంటే – ఒక రోజు ఆ మొగుడు వెధవ తాగుడికి డబ్బులిమ్మని పేచీ పెట్టాట్ట. ఈ పిల్ల లేవందిట. మంగళసూత్రంతో సహా వాడికిచ్చేసింది – ఇంకేం వుంది దానిదగ్గర ? కానీ ఆ వెధవ ఆరోజు దాన్ని చావచితకతన్ని ఇల్లంతా గాలించేట్ట. అపుడు దొరికిందట– ఇవన్నీ అయిపోయేక వాళ్ళూ వీళ్ళూ అనుకుంటుంటే విన్న బాపతు. నిజం ఎంతో అబద్ధం ఎంతో ఆ దేవుడికే తెలియాలి.

“ ఇంతకీ మాణిక్యం మొగుడికి ఏం దొరికింది ? ” ఆత్రంగా అడిగాడు.

“ ఉంగరం – బంగారపు ఉంగరం. అదెక్కడిదో, దానికెవరిచ్చారో, అసలు తిండికి మొహం వాచిన దాని దగ్గర అంత ఖరీదైన వుంగరం ఎలా వచ్చిందో ఇప్పటికీ అంతుపట్టని సంగతి – దానిమొగుడు దొరికిందే చాలని పుచ్చుకుపోబోయేట్ట. మాణిక్యం అడ్డంపడి నా ప్రాణాలైనా ఇస్తాగానీ, ఆ వుంగరం మాత్రం ఇవ్వనని మొండికెత్తి మొగుడితో పోట్లాడిందిట. వాడు ఇంకో విడత దాన్ని చితకతన్ని ఆ వుంగరం పుచ్చుకుని లేచక్కా పోయేడు. అంతే ! మళ్ళీ వాడు. తిరిగొచ్చేసరికి వొళ్ళంతా కిరసనాయిలు పోసుకుని అంటించుకుని మాడి మసైపోయింది. అయినా దానికిమాత్రం అంత దూకుడయితే ఎలా ?

వెధవ ముష్టి వుంగరం గురించి ప్రాణాలు తీసుకుంటుందా – నువ్వు చెప్పు "

వివేకానికి గొంతు పూడుకుపోయింది. కళ్ళు ఎర్రగా జ్యోతుల్లాగా మెరుస్తున్నాయి. బాధవల్ల మొహం వివర్ణమైంది.

" ఆ రోజు వూరు వూరంతా దాని ఇంటిముందరేవుంది. ఎటువంటి మాణిక్యం ఎలా అయిపోయింది అన్పించింది నాకు దాన్ని ఆస్పత్రిలో చూసేక. దాహం దాహం అంటూ ఒకటే గోల. నాకు జాలేసి రెండు చెంచాల నీళ్ళు గొంతులోపోసేను. గుటకేసింది. ఏం మాణిక్యం ఎలా వుందంటే సమాధానం చెప్పకుండా వివేకం వివేకం అంటూ గొణిగింది. అంతే నేవచ్చేశా, ఆ రాత్రే – "

చెపుతున్న ఆచారిగారు ఒక్కసారిగా ఆపేశారు ఎదురుగా శ్రోతలేదని గమనించి – కుర్చీలోంచిలేచి షాపు గుమ్మంలోకొచ్చి చూసేరు. పెద్ద పెద్ద అంగలేసుకుంటూ – క్రిష్ణా నదివైపుగా ఆవేశంగా వెడుతున్న వివేకాన్ని చూసి కలవరాన్ని మొహంలో కనబర్చారు.

⭑ ⭑ ⭑

ప్రేమంటే భోగవస్తువో, సంభోగవస్తువో కాదు.

ప్రేమంటే తియ్యటి అనుభూతి – మధురమైన భావన.

ప్రేమించటానికి ధైర్యం అక్కర్లేదు దానికోసం నిలబడేందుకు, అందుకై పోరాడేందుకు కావాలి.

పిరికివాళ్ళు ప్రేమకోసం బ్రతకనూలేరు – దానికోసం చావనూలేరు –

అంచేత వివేకం ఇంకా బ్రతికేవున్నాడు.

------- అయ్యిపోయింది -------